




రోజంతా విసుగు, విరామం లేకుండా తిరిగిన దినకరుడు పశ్చిమాద్రి కొండల చాటున విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇక నెల రాజు వాహ్యాళికి బయలుదేరాడు. నింగిపై తారలు ఒక్కొక్కటే తొంగిచూస్తున్నాయి.

కళానిలయం ప్రాంతంలో నేల ఈనినట్టు జనం. తండోపతండాలుగా జనం కళానిలయం చేరుకుంటున్నారు. అందరిలోనూ పరవళ్ళు తొక్కుతున్న ఉత్సాహం.

మహానటి మోహినిని సాధ్యమయినంత దగ్గరగా చూడాలని తాపత్రయం. కళానిలయం కిక్కిరిసి పోయింది.

జనసందోహాన్ని అదుపు చేయడం నిర్వాహకులకు సాధ్యం కావడంలేదు. మహానటిగా అవార్డుల పరంపరలందుకొని దక్షిణాది భాషా చిత్రాలలో తిరుగులేని రాణిగా రాజ్యమేలుతున్న మోహిని పుట్టి, పెరిగి ప్రాభవం సంపాదించిన ఊరికి రావడం ఇదే మొదటిసారి కావడంతో జనానికి పట్టలేనంత ఆనందంగా ఉంది.

'మోహిని తమ మనిషి' అన్న భావం అందరిలోనూ అంతర్లీనంగా తాండవమాడుతోంది.

ఇక అభిమానుల కోలాహలానికి అంతేలేదు.

అవధులు దాటుతున్న వారి సంబరం అంబరాన్ని తాకుతోంది. ఏ క్షణంలో మోహిని సమ్మోహన హాసంతో కారు దిగుతుందోనని కళ్లల్లో వత్తులేసుకుని చూస్తున్నారు.

"ఇదిగో ... రెండు నిముషాల్లో ఆవిడ వచ్చేస్తారు" అంటూ నిర్వాహకులు అభిమానులను ఊరిస్తున్నారు.

"అసలు అంతగా ఆర్థిక స్తోమతలేని ఈ నాటక సమాజం ఏర్పాటుచేసిన ఈ సన్మాన సభకు మోహిని వస్తుందా" అని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

"ఎందుకు రాదు ... ఈ నాటక సమాజంలోనే మొదటిసారిగా మొఖానికి రంగు వేసుకుని ... ఈ నాటక సమాజం ద్వారానే అనేక నాటకాలు ఆడి మంచి పేరు తెచ్చుకుని ... చివరికి ఈ సమాజం ఆడిన "ఆడది" నాటికద్వారాపరిశ్రమ పెద్దలను ఆకర్షించి పెద్ద స్టార్ అయిపోయిన మోహిని ఇప్పుడు - ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసే చందాన ప్రవర్తిస్తుందా, లేదు ... వచ్చి తీరుతుంది" అంటూ మరికొందరు వాదిస్తున్నారు.

అందరిలో స్పందన ...

ఉత్సాహం ...

ఉద్వేగం ...

వందలాది సినిమాల్లో నటించి తమను సంభ్రమపరచిన ఆరాధ్య దైవాన్ని చూడబోతున్నామన్న స్పందన ... వెండితెర ఇలవేలుపు మోహినిని తక్షణం చూడాలన్న తపన ... అసలు ఆ దివ్య సుందరి వస్తుందా? వస్తే ఎంతసేపు తమ కళ్ల ముందు ఉంటుందన్న ఉద్వేగం అందరినీ పట్టి ఊపేస్తున్నాయి.

"అదిగో మోహినీ కారు" అరిచారెవరో ...

కొన్ని వేల కళ్ళు అటు తిరిగాయి.

వారి నరాల్లో ప్రవహిస్తున్నది రక్తంకాదు ... టెన్షన్.

మారుతి కారు మనోహరంగా వచ్చి ఆగింది.

అందులో నుంచి-

సుతారంగా దిగింది సినీనటి, అభిమానుల ఆశాజ్యోతి మోహిని.

"జిందాబాద్ మోహినిగారు"

"అగ్రనాయిక మోహిని వర్ధిల్లాలి"


"సూపర్ హీరోయిన్ మోహిని జిందాబాద్"

అన్న నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.

మోహిని, ఆమె తండ్రి వాసుదేవరావు అతి కష్టంమీద కళానిలయంలోకి చేరుకున్నారు.

వాసుదేవరావు ఒకసారి హాలంతా కలియజూశాడు. హాలంతా జనసందోహంతో కిటకిటలాడుతోంది.

ఆయనకు కళానిలయాన్ని చూస్తుంటే మాతృమూర్తిని చూస్తున్న అనుభూతి కలుగుతోంది. ఇప్పుడు మోహినిని సత్కరిస్తున్న 'అభ్యుదయ నాటక సమాజం'వారే ఈ కళానిలయంలో తొలిసారి నాటకంలో వేషం వేసే అవకాశం ఇచ్చింది. తన చిన్నారి మోహినికి కడుపునిండా తిండిపెట్టలేక ఇదే కళానిలయంలో పస్తులతో గడిపిన నిశిరాత్రులెన్నెన్నో ... ఈ కళానిలయం ద్వారానే తన మోహినికి గుర్తింపు వచ్చింది. ఈ అభ్యుదయ సమాజానికి వేయి జన్మలు తామిద్దరం సేవలు చేసుకున్నా ఋణం తీరదు. ఇదే కళానిలయంలో 'అభ్యుదయ నాటక సమాజం' వారు ఆడిన నాటకంలో మోహిని పాత్రను, ఆమె నటనను ప్రశంసించి మద్రాస్ తీసుకెళ్లి నిర్మాత నరసింహం





గారు సినిమా ఛాన్స్ యిచ్చిన మధురానుభూతి ప్రతి రోజూ అన్నం తినే ముందు వాసుదేవరావుగారి కళ్ల ముందు కదులుతుంది.

అలాంటి కళానిలయానికి, తమకు చేయూత నిచ్చిన అభ్యుదయ నాటక సమాజానికి గొప్ప స్టార్‌అయి మోహిని ఏం చేసింది? అన్న విషయం గుర్తుకు వస్తే మాత్రం ఆయనకు ముద్ద గొంతుకు దిగేదికాదు.

"అభ్యుదయ నాటక సమాజం ఇప్పుడు దీనావస్థలో వుందట. ఎంతో కొంత సాయం చేయాలమ్మాయి" అంటే మోహిని రుస రుసలాడేది. మనకు ప్రతిభ ఉంది పైకొచ్చాం - మధ్యలో ఆ సమాజమేం చేసిందీ అని కొట్టిపారేసేది. అలాంటి సమయాల్లో వాసుదేవరావుగారు వ్యాకులమైన మనసుతో పక్కకు తప్పుకునేవారు.

అలాంటిది - ఓనాడు ...

అభ్యుదయ నాటక సమాజం నిర్వాహకులు మద్రాస్ వచ్చి నాలుగు రోజులు నిరీక్షించి ఎలాగైతేనేం మోహినిని కలుసుకోగలిగారు.

"అమ్మా! నువ్వు మా చేతులమీద పైకొచ్చిన చిట్టివమ్మా ... నీకు సన్మానం చేసి అందరూ దీవిస్తుంటే కళ్లారా చూడాలని వుంది. మా కోరిక మన్నించమ్మా" అంటూ వాళ్లు మోహినిని వేడుకుంటూంటే వాసుదేవరావు గారు కూడా మౌనంగా రోదించారు.

అదురుతున్న గుండెతో కూతురు నోటి నుండి ఏం సమాధానం వస్తుందోనని ఎదురు చూశారు.

"వస్తాను ... మీరంతగా ప్రాధేయపడుతుంటే తప్పుతుందా! ఏర్పాటు చేసుకోండి" అని చెప్పి కారెక్కి వెళ్లిపోయింది మోహిని.

ఆ మాట వాసుదేవరావు గారికి పన్నీటి జల్లులా అన్పించింది. నిర్వాహకులకంటే ఆయన ఎక్కువ సంతోషించారు, కూతురు మనసులో ఏ మూలో ఇంకా కృతజ్ఞత మిగిలి వున్నందుకు.

కళానిలయం అంతటా కరతాళ ధ్వనులు మారుమోగాయి.

వాసుదేవరావు గారు ఉలిక్కిపడి గతం నుంచి

# ఈ వేమన పద్యాలు




పాపమనగ వేఱె పరదేశమున లేదు
తనదు కర్మమునను తగిలియుండు
కర్మ ధర్మములను కనుగొనుటొప్పకు
విశ్వదాభిరామ వినుర వేమ.

వర్తమానంలోకి వచ్చారు. వేదిక మీద కూర్చున్న మోహిని నుదుట కుంకుమ ... మెడలో పూలమాలలు. నిర్వాహకులలో సీనియర్ ఒకాయన మాట్లాడుతున్నాడు.

"మీ అందరికీ తెలుసు. ఒకప్పుడు ప్రాభవదీప్తులు వెదజల్లిన అభ్యుదయ నాటక సమాజం నేడు దీనావస్థలో ఉంది. మేమేదో చిన్న చిన్న ఉద్యోగస్థులం. మాలో ఒక్కరుగా మెలగి ఈనాడు తారాపథంలో అగ్రస్థానాన్ని అధిష్ఠించిన మోహిని గారిని సత్కరించాలన్న ఆలోచన అయితే ఏర్పడింది కానీ దానికి కావలసిన ఆర్థిక సంపత్తి సమకూర లేదు. ఏదో మాకు ఉన్నంతలో మేము తెచ్చిన ఈ చీరను మోహినిగారిని స్వీకరించవలసిందిగా కోరుతున్నాము" అంటూ కరతాళ ధ్వనుల మధ్య

## మహానటి

మోహినికి చీర అందించారు.

కొద్దిసేపటికి -

మోహిని మైకు దగ్గరకు వచ్చింది -

హాలులో గుండు సూది పడినా విన్పించేటంత నిశ్శబ్దం.

అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

"అందరికీ నమస్కారం. నేను ఎన్నెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించినా అదంతా అభ్యుదయ నాటక సమాజం పెట్టిన భిక్షేనని నేను జన్మలో మర్చిపోను. నేనంటే ఎవరికీ తెలియని రోజున సమాజం నన్ను ఆత్మీయురాలిగా అక్కున జేర్చుకుంది. నాకు నటనలో అక్షరాభ్యాసం చేసింది. అభినయంలో అ ... ఆ ... లు నేను ఇక్కడే నేర్చుకున్నాను. నిజానికి నాకు కన్నతల్లి కన్నా, కన్నతండ్రి కన్నా సమాజం ఎక్కువ. నేను ఎన్నెన్ని కీర్తి కిరీటాలు ధరించినా మీ మధ్య వున్నప్పుడు పొందే ఆనందాన్ని అనుభవించలేను. నేను మీలో ఒక్కరిని. నన్ను వేరు చేయవద్దు. ఎన్నో ఇబ్బందుల్లో ఉండి కూడ నన్ను సత్కరించి ఆడబడుచులా భావించి ఇచ్చిన ఈ చీర నాకు అపురూపమయినది. మీ అందరికీ మరోసారి కృతజ్ఞతలు ..."

ప్రసంగం ముగించింది మోహిని.

సభికుల హర్షధ్వానాలతో కళానిలయం దద్దరిల్లిపోయింది. కళ్ళకొనకల్లో చేరిన కన్నీటి చుక్కలను వాసుదేవరావు గారు తుడుచుకుంటూ "ఎంతైనా నా కూతురు సుమా" అనుకున్నారు.

మోహిని, వాసుదేవరావు గారిని నిర్వాహకులు అతి కష్టంమీద కారు ఎక్కించారు. కారు పరుగెత్తుతుంటే చల్లటి గాలి మొఖాన్ని తాకి ఆహ్లాద పరుస్తోంది. ఆయన మనస్సు నిండా తృప్తి, సంతోషంతో కళ్ళు మూసుకొని సీటుకి జారగిల్లారు.

రెండు నిముషాల తర్వాత మోహిని మాటలు విన్పించి కళ్ళు తెరిచి వాసుదేవరావుగారు నిస్తేజమయ్యారు.

మోహిని నుదుట బొట్టు చెరిపేసుకుంది. పూలదండలు వేస్తున్నప్పుడు తలపై పడ్డ పూలను దులుపుకుంటూ -

"ఛీ ఛీ ... వెధవ గోల ... సత్కారమంట ... సత్కారం పేరుతో నా ప్రాణంతీశారు. సొంత ఊర్లో సన్మానం చేస్తాం రమ్మంటే రాలేదని జనం అనుకుంటారని వప్పుకుంటే ఈ 'బ్రూట్స్' వల్ల మంచి శాస్తి జరిగింది. సరిగ్గా ఫ్యాన్ గాలి కూడా లేని ఆ హాలులో ఒక్క క్షణం కూర్చో లేకపోయాను. సన్మానం అంటే అదా? లేని వెధవలు లేనట్లు పడుండాలి. సన్మానం అని తీసుకెళ్ళి అంత 'చీప్'గా చేస్తారా వెధవలు ... నా ప్రెస్టేజీ అంతా గంగలో కలిపారు బాస్టర్డ్స్".

వాసుదేవరావుగారిలో భూకంపప్రకంపనాలు.

"నా వేల్యూబుల్ టైమ్ వేస్ట్ చేశారు పనికిమాలిన వెధవలు ..." అంటూ మధ్యలో నాప్‌కిన్ సీట్ పైన పడటంతో అప్పుడు చూసింది నిర్వాహకులు ఇచ్చిన చీరను.

" ... ఈ చీరను నేను కట్టుకోవాలట ... నా ఇంట్లో పనిమనిషి కూడా ఇలాంటి చీర కట్టదు ..."

నిరుత్తరుడయిన వాసుదేవరావుగారు చలనరహితంగా చూస్తున్నారు.

మోహిని విసురుగా చీరను తీసి కారు విండో నుంచి బయటకు విసిరేసింది.

సరిగ్గా-

అప్పుడే వెనకనుంచి వస్తున్న కారు టైరు కింద పడిన చీరను చూస్తున్న ఆ 'మహానటి' తండ్రి కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీళ్ళు ఆ దృశ్యాన్ని మసకబార్చాయి. □